# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ ఈశాన్య ప్రాంతం దేశాభివృద్ధికి చోదక శక్తిగా మారుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.

❖ చట్టసభలు అర్థవంతమైన చర్చలకు వేదికలుగా ఉండాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆకాంక్షించారు.

❖ భారతదేశ విజ్ఞాన వారసత్వాన్ని ప్రపంచానికి అందించడానికి 'జ్ఞాన్ భారతం మిషన్' దోహదపడుతుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.

❖ 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026' రెండవ ఎడిషన్‌ను కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిజోరం రాష్ట్ర రాజధాని ఐజ్వాల్‌లో 9 వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు దృశ్యమాధ్యమ విధానం ద్వారా ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా, 8 వేల కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన బైరబి-సైరాంగ్ కొత్త రైలు మార్గాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. దీంతో మిజోరం రాజధాని తొలిసారిగా భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానమైంది. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ... బైరాబి-సైరాంగ్ రైల్వే లైన్ మిజోరం ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉందని, ఈశాన్య ప్రాంతం దేశాభివృద్ధికి చోదక శక్తిగా మారుతోందని తెలిపారు. యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఈశాన్య ఆర్థిక కారిడార్‌లలో మిజోరం కీలక పాత్ర పోషిస్తుందని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

అదే విధంగా 'ఆపరేషన్ సింధూర్'ను ప్రస్తావిస్తూ.. ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే వారికి భారత సైనికులు తగిన గుణపాఠం నేర్పారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. ప్రజల జీవనాన్ని, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని అన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన భావితరం వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) సంస్కరణల వల్ల అనేక ఉత్పత్తులపై పన్నులు తగ్గుతాయని, ఇది ప్రజల జీవితాలను మరింత మెరుగు పరుస్తుందని ప్రధానమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 37 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

చట్టసభలు అర్థవంతమైన చర్చలకు వేదికలుగా ఉండాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆకాంక్షించారు. బెంగళూరులో ఈరోజు జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ 11వ భారత ప్రాంతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాకారం చేయడానికి చట్టసభలు కృషి చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. శాసనసభ్యులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. పార్లమెంటు సభ్యులు రాజకీయలకు అతీతంగా, సామాజిక శ్రేయస్సు కోసం కృషి చేయాలని ఓం బిర్లా పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'జ్ఞాన్ భారతం మిషన్' మొదటి అంతర్జాతీయ సదస్సు ఢిల్లీలో జరగడంపై కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలిపారు. తాళపత్రాలు, తామ్రపత్రాలు, శిలాశాసనాలలో నిక్షిప్తమైన భారతదేశ విజ్ఞానం, పరిశోధనలను కొత్త తరానికి అందించేందుకు ఈ మిషన్‌ను ఉప యుక్తంగా వుంటుందని అమిత్ షా తెలిపారు. 'జ్ఞాన్ భారతం మిషన్' కింద దేశ వ్యాప్తంగా కోటి కంటే ఎక్కువ తాళపత్రాలను సర్వే చేయడం, వాటిని భద్రపరచడం, విశ్లేషించడం వంటివి 483 కోట్ల రూపాయల వ్యయంతో చేపడతారని అమిత్ షా చెప్పారు. ఈ మిషన్ ద్వారా భారతదేశ అపారమైన విజ్ఞాన వారసత్వాన్ని ప్రపంచానికి తిరిగి పరిచయం చేయవచ్చని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ప్రజలతో నావికా దళాల అనుబంధాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారత నౌకాదళం కార్ ర్యాలీని ప్రారంభించింది. నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠి ఢిల్లీలో ఈ రోజు ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో 34 మంది నావికాదళ సిబ్బంది, నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ (NWWA) సభ్యులు పాల్గొంటున్నారని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జాతీయ సమగ్రత కోసం భారత నౌకాదళం చేస్తున్న కృషికి ఈ ర్యాలీ నిదర్శనమని తెలిపింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈశాన్య ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మణిపూర్‌లోని చురాచాంద్‌పుర్‌లో 7 వేల 300 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, లోయలలోని వివిధ వర్గాలు ఒప్పందాలు కుదుర్చుకోవడం సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఆ రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మణిపూర్ భూమి ధైర్యానికి, శౌర్యానికి ప్రతీక అని ప్రశంసించారు. 2014 నుంచి ఈశాన్య ప్రాంతంలో కనెక్టివిటీని మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని ప్రధానమంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువత సారథ్యంలోని ప్రజాస్వామ్యానికి నిజమైన ఉదాహరణ 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమం అని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. యువత తమ ఆలోచనలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నేరుగా తెలియజేసే ఏకైక వేదిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో

ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2026' రెండో ఎడిషన్‌ను కేంద్రమంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా యువతను ఒకచోట చేర్చి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి, వారి నాయకత్వాన్ని, ఆవిష్కరణలను ప్రోత్సహించే ఒక నిరంతర వేదిక ఈ కార్యక్రమమని మన్‌సుఖ్ మాండవీయ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

2027లో జరగనున్న 5వ గ్లోబల్ కోస్ట్ గార్డ్ సదస్సు కు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్నది. ఈ విషయాన్ని ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేసింది. ఇటలీలోని రోమ్‌లో జరిగిన నాలుగవ గ్లోబల్ కోస్ట్ గార్డ్ సదస్సులో భారత్ బిడ్‌ను గెలుచుకుంది. ఈ సదస్సులో ఇండియన్ కోస్ట్ గార్డ్ డైరెక్టర్ జనరల్ పరమేశ్ శివమణి భారత ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. సదస్సులో 115 దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోస్ట్ గార్డ్‌ల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంపై ఈ సదస్సులో చర్చించారు. 2027 చెన్నైలో 5వ గ్లోబల్ కోస్ట్ గార్డ్ సదస్సు, ఇండియన్ కోస్ట్ గార్డ్ స్వర్ణ జయంతి సందర్భంగా జరగనుండడం విశేషం.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఈ రోజు నుండి వారం రోజుల పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లో రానున్న 48 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. ఈ నెల 18 నాటికి మధ్య, నైరుతి భారతదేశంలో వర్షాల తీవ్రత తగ్గుముఖం పడుతుందని తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి హాంగ్ కాంగ్ ఓపెన్ పురుషుల డబుల్స్ ఫైనల్‌కు చేరుకున్నారు. ప్రపంచ నంబర్ వన్ ర్యాంకులో ఉన్న ఈ భారత జోడీ.. సెమీఫైనల్‌లో చైనీస్ తైపీకి చెందిన చెన్ చెంగ్ కువాన్, లిన్ బింగ్-వెయ్ జోడీని 21-17, 21-15 తేడాతో ఓడించి ఫైనల్‌లోకి అడుగుపెట్టారు. మరోవైపు, పురుషుల సింగిల్స్ సెమీఫైనల్‌లో భారత ఆటగాడు లక్ష్యసేన్, చైనీస్ తైపీకి చెందిన చౌ టియెన్-చెన్‌తో తలపడనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర హోం శాఖ, సహకార శాఖల మంత్రి అమిత్ షా ఈ నెల 16న ఢిల్లీలో రెండవ జాతీయ మాదకద్రవ్యాల నిరోధక టాస్క్ ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్) సమావేశాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఆయన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) 2024 వార్షిక నివేదికను విడుదల చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =